పత్రికాప్రకటన                                        కాకినాడ, మార్చి 5 , 2018.

**పారిశుధ్య పనులను నిర్లక్ష్యం చేస్తే ఉపేక్షించేది లేదు.**

**ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశాలు వెంటనే నిర్వహించాలి.**

– జిల్లా కలెక్టర్ కార్తికేయ మిశ్రా

జిల్లాలోని మున్సిపాలిటీలు, గ్రామ పంచాయతీలలో ప్రజారోగ్య పరిరక్షణ పనులకు ప్రాధాన్యత నివ్వాలని, పారిశుధ్య పనులలో నిర్లక్ష్యం వహిస్తే ఉపేక్షించేది లేదని జిల్లా కలెక్టర్ కార్తికేయ మిశ్రా హెచ్చరించారు. సోమవారంనాడు కాకినాడ కలెక్టరేట్ నుండి డివిజన్ , మండల స్థాయి అధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టరు మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతంలో మెడికల్ క్యాంపులు నిర్వహించి, ఆరోగ్య పరిరక్షణ కోసం చర్యలు చేపట్టాలన్నారు. జిల్లాలోని ఏజెన్సీలో ఆరోగ్య పరమైన అంశాలకు ప్రాధాన్యతనిచ్చి తగు చర్యలు వెంటనే చేపట్టాలని, ఐటిడిఏ పిఓలను కలెక్టరు ఆదేశించారు. అదే విధంగా జిల్లాలోని పట్టణాలు, గ్రామ పంచాయతీలలో పారిశుధ్య కార్యక్రమాలలో భాగంగా డ్రైయిన్‌లలో పూడికతీత పనులను వెంటనే చేపట్టి నీటి నిలువలు లేకుండా చూడాలన్నారు. వర్షాకాలానికి ముందే కనీసం రెండు సార్లయినా డ్రైయిన్‌లలో పూడికలు తీయాలన్నారు. అదే విధంగా జిల్లాలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లు, ఏరియా ఆసుపత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల అభివృద్ధి కమిటీ సమావేశాలను ఈ వారాంతంలోగా ఏర్పాటు చేయాలన్నారు. ఈ కమిటీ సమావేశాలలో తీసుకున్న నిర్ణయాలను వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలని కూడా కలెక్టరు ఆదేశించారు. ప్రజారోగ్య పరిరక్షణలో భాగంగా డివిజన్ స్థాయిలో ప్రతీ 15 రోజుల కొకసారి సమీక్షా సమావేశాలు ఏర్పాటు చేయాలని సబ్ కలెక్టరులను , ఆర్‌డిఓలను ఆదేశించారు. ఈ సమావేశంలో గ్రామ , పట్టణ స్థాయి పారిశుధ్యం, డ్రైయిన్లలో మురుగు నీరు తొలగింపు, వేసవి కార్యాచరణ ప్రణాళిక, ఐఎంఆర్/ఎంఎంఆర్, రక్తహీనత, పౌష్టికాహార లోపం, వ్యాధినిరోధక టీకాలు వంటి అంశాలపై చర్చించాలన్నారు. ఈ సమావేశాలకు డివిజనల్ పంచాయతీ అధికారి, డిప్యూటీ డిఎంహెచ్ఓ, ఐసిడిఎస్ అధికారులు కూడా హాజరు కావాలని కలెక్టరు ఆదేశించారు.

**అన్ని గ్రామ పంచాయతీలు వ్యర్థ, ఘన పదార్ధాలు నిర్వహణ యూనిట్‌లు చేపట్టాలి :**

జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీలలో **వ్యర్థ, ఘనపదార్ధాల నిర్వహణ యూనిట్‌లు (సాలిడ్ వేస్ట్ ప్రోసెసింగ్ సెంటర్‌లు )** ఏర్పాటు చేయాలని కలెక్టరు ఆదేశించారు. జిల్లాలో ఉన్న 1069 పంచాయతీలకుగాను ఇప్పటికే 434 గ్రామాల్లో యూనిట్‌ల ఏర్పాటు చేయడానికి చర్యలు చేపట్టారని, మరో 500 యూనిట్‌లు మార్చి నెలాఖరుకు పూర్తి చేయాలని, ఏప్రియల్ నెలాఖరు నాటికి అన్ని గ్రామాలలో యూనిట్‌లు ఏర్పాటు చేయాలని కలెక్టరు సూచించారు. జిల్లాలో ఎన్‌టిఆర్ గృహ నిర్మాణ పథకం ప్రగతిని సమీక్షిస్తూ ఈ పథకం క్రింద నివాస స్థలాల ధృవీకరణ పత్రాలు వెంటనే అందజేయాలని తహశిల్దారులను ఆదేశించారు. ఏజెన్సీలోని వాటర్ షెడ్ మేనేజ్‌మెంట్లు పనులలో ప్రగతిని చూపాలని కలెక్టరు సూచించారు.

ఉపాధి హామీ పథకం క్రింద జిల్లాలో చేపట్టిన ప్లేఫీల్డ్స్‌లో ఇప్పటి వరకు కేవలం 36 మాత్రమే పూర్తయ్యాయని, మంజూరు చేసిన ఆట స్థలాలు అన్నిటి నిర్మాణం ఈ మాసాంతానికి పూర్తికావాలని ఆదేశించారు. రంపచోడవరంలో ప్రతిపాదించిన స్పోర్ట్స్ స్టేడియం కొరకు ఇప్పటి వరకు ప్రోజెక్ట్ రిపోర్ట్ సిద్ధం కాకపోవడం పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. రెండు కోట్ల నిధులతో క్రొత్తగా మంజూరైన మరో గిరిజన స్టేడియాన్ని చింతూరులో నిర్మించేందుకు స్థలం గుర్తించాలని ఆదేశించారు. జిల్లాలో స్వఛ్ఛభారత్ పారిశుధ్యఉద్యమాన్ని నిరంతరం కొనసాగించేందుకు డిఆర్‌డిఏ, ఆర్‌డబ్ల్యూఎస్ సమన్వయంతో జిల్లా వ్యాప్తంగా ఐఇసి కార్యక్రమాలు నిర్వహించాలని అన్ని అంగన్‌వాడీ కేంద్రాలు, పిహెచ్‌సీలు, సిహెచ్‌సీలలో స్వఛ్ఛభారత్ సందేశాల హోర్డింగ్‌లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. మున్సిపాలిటీలలో గృహ నిర్మాణాలు, అమ్మ కేంటీన్లు, ఇతర అభివృద్ధి పనులకు భూమి అవసరాలను తెలియజేస్తూ బుధవారం నాటికి నివేదికలు పంపించాలని మున్సిపల్ కమీషనర్‌లను ఆదేశించారు.

ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఎ.మల్లిఖార్జున, జేసి-2 జె.రాధాకృష్ణమూర్తి, డిఎఫ్ఓ నందినీ సలారియా, డిఎఫ్ఓ సోషల్ ఫారెస్ట్ ప్రసూన, డిఆర్ఓ ఎస్‌విఎస్ సుబ్బలక్ష్మి, డ్వామా పిడి రాజకుమారి, డిఆర్‌డిఏ పిడి ఎస్.మల్లిబాబు, హౌసింగ్ పిడి వీరేశ్వరప్రసాద్, జిల్లా పరిషత్ సిఇఓ ఆర్.గోవిందరావు, కాకినాడ మున్సిపల్ కార్పొరేషన్ కమీషనర్ కె.శివ పార్వతి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

( సమాచార శాఖ చే జారీ )